



ఆర్‌సీబీ ఫ్లెక్సీ చూపిస్తూ చిన్నారి

సాగరతీరం.. ఆనంద మైదాన్!



బీసీసీఐ ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్ వద్ద వేడుకలు.. బాణసంచా కాల్పులు

కాకినాడలో కిక్కిరిసిన క్రీడామైదానం



అదిరిన యాంకరింగ్

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానం క్రికెట్ అభిమానులతో కిక్..రిసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ ఫైనల్‌తో క్రికెట్ అభిమానులతో సందడి.. సందడిగా మారింది. క్రికెట్ ప్రేక్షకుల కోసం బీసీసీఐ దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా కాకినాడలో ఏర్పాటు చేసిన ఐపీఎల్ లైవ్ మ్యాచ్ వీక్షణకు అశేష స్పందన లభించిందిగ్రౌండ్‌లో 10 వేల మందికి ఏర్పాట్లు చేయగా 20 వేల మంది మ్యాచ్ వీక్షించడానికి హాజరైనట్లు అంచనా. సెమీ ఫైనల్ లో వర్షం జాప్యం కొంచెం నిరాశ పరిచినా..ఫైనల్ మ్యాచ్ మాత్రం క్రీడా అభిమానుల్లో ఫుల్ జోష్ నింపింది. పంజాబ్-బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్‌ను క్రికెట్ అభిమానులు తరలివచ్చి ఆనందంగా వీక్షించారు. లైవ్ షో వీక్షించేందుకు విచ్చేసిన క్రికెట్ అభిమానులకు ఏర్పాటు చేసిన లక్కీ డ్రాను రాజ్యసభ ఎంపీ, ఏసీఏ సెక్రటరీ సానా సతీష్‌బాబు డ్రా తీసి గెలుపొందిన చిన్నారికి కోహ్లీ సంతకంతో ఉన్న టీషర్టు అందించారు. సానా సతీష్‌బాబు మాట్లాడుతూ ఇకపై ఐపీఎల్ సందడి మన కాకినాడలో ఇలాగే ఉంటుందని అభిమానుల్లో జోష్ నింపారు. ఐపీఎల్ ఫైనల్ లైవ్ స్క్రీనింగ్ చూసే ఏకైక ఫ్యాన్ పార్క్ కాకినాడలో ఏర్పాటు చేయడంతో చిన్నా, పెద్ద కుటుంబాలతో బాగా ఎంజా య్ చేశారు. లైవ్ మ్యాచ్ స్క్రీనింగ్ మధ్యలో డీజే ప్లే చేయడంతో డ్యాన్సులతో అదరగొట్టారు.





చిన్నారుల సందడి



నీవే విజేత : డ్రా గెలిచిన చిన్నారికి కోహ్లీ టీషర్ట్ అందించిన ఎంపీ సానా



మ్యాచ్ వీక్షిస్తున్న ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ పద్మశ్రీ, జ్యోతుల నవీన్



మైదానంలో మ్యాచ్ చూస్తు యువకుల హంగామా



మధుర క్షణాలు సెల్‌లో బంధిస్తూ..



ఆ.. అద్యంతం.. ఆఆ.. ఆనందమే



ఐపీఎల్ మ్యాచ్ ముగిసిన తర్వాత భానుగుడివద్ద క్రీడాభిమానుల కేరింతలు

ఓటు ఏం చేయగలదు..?
ఓటు వజ్రాయుధం ఎలా?
ఓటుతో భవిష్యత్ ఎలా మారుతోంది?
ఓటుకు ఉన్న సత్తా ఏమిటి?
ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే 2024..
ఓటుకు నోటేశారు..
భయపెట్టి నోటికి తాళాలు వేసేశారు..
మరో 30 ఏళ్లు అధికారం మాదే
అంటూ బింకాలు పలికారు..
ఓటరు ఊరుకున్నాడు.. ఊరుకున్నాడు..
ఐదేళ్లూ చూశాడు.. చూశాడు..
2024లో అతని రోజు రానే వచ్చింది..
ఓటు శాసించింది..
మాకేంటి అని బింకాలు పలికిన నాయకులను మూలన కూర్చోపెట్టింది.. మరో 30 ఏళ్లు మాదేనంటూ విర్రవీగిన నాయకులను ఇళ్లకే పరిమితం చేసేసింది.. రాక్షస పాలనకు ఓటు చరమగీతం పాడింది. గోదారంతా ఫ్యాన్‌ను ఊడ్చి కొట్టారు..సరిగ్గా ఇదే రోజు గతేడాది జూన్ 4న కూటమికి పట్టం కట్టారు. ప్రస్తుతం చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధిని చూస్తున్నారు..ఆ రోజులు.. ఏడాదిలో ఈ రోజులు బేరీజు వేసుకుంటూ హమ్మయ్య అంటూ గుండెలపై చేయి వేసుకుని హాయిగా నిద్రపోతున్నారు..

- (కాకినాడ,ఆంధ్రజ్యోతి)



ఓటర్లు..బారులు : రాజమహేంద్రవరంలో 2024, మే 13న ఓటర్ల భారీ క్యూ

ఓ..టర్న్!

ఐదేళ్లు విసిగి.. ఫ్యాన్ అంతం చూశారు!

ఆ ఐదేళ్లు తల్చుకుంటేనే వణుకు.. అధికారం ముసుగులో అంతటా అరాచకం..పేట్రేగిపోయిన విచ్చలవిడితనం.. రాత్రి8 గంటలు దాటిన తరువాత బయలకు వెళ్లాలంటేనే బ్లేడ్ బ్యాచ్‌లతో భయం భయం.ఓట్లేసి గెలిపించి నందుకు ప్రజలను పీడించేయడం.. సహజవనరుల లూటీ.. భూ కబ్జాలు..బెదిరింపులు.. ప్రశ్నిస్తే కేసులు..ప్రజల సొంత ఆస్తులపై సైతం కన్నేసి కాటే యడం...డ్రైవర్‌ను హత్య చేసి మృత దేహాన్ని ఇంటికే డోర్ డెలివరీ చేయడం.. పోలీసులే నిందితుడికి రక్షణ ఇవ్వడం..ఎక్కడ చూసినా రోడ్లన్నీ గోతులు..వాటిపై ప్రయా ణిస్తే ప్రాణం హరీ అనే పరిస్థితులు.. వైసీపీ ఐదేళ్ల పాలన ప్రజ లకు ప్రత్యక్ష నరకం చూపించింది. వీటన్నింటిపై విసిగెత్తిపోయిన ప్రజలు సరిగ్గా ఏడాది కిందట ఓటుతో కసితీరా వైసీపీని వేటాడారు. ఓట్లతో దండయాత్ర చేసి వైసీపీ పీడను విరగడ చేశారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఫ్యాన్‌ను ముక్కముక్కలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని బతికిస్తూ కూట మికి పట్టం కట్టారు. మొత్తం 21 సీట్లకు 21 చోట్లా గెలిపించి బ్రహ్మరథం పట్టారు.అదే సమ యంలో తొలిసారి జనసేన సత్తా చాటింది. పోటీచేసిన అన్నిచోట్లా విజయ దుందుభి మోగించింది.

ఆ ఐదేళ్లూ ఎంత విరగబాటో...

2019 మే 23...ఒక్క ఛాన్స్ అంటూ రకరకాల మోసపూరిత హామీలతో జగన్ జనాన్ని వంచించి గెలిచిన రోజు.. అదే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు పెనుశాపంగా మారుతుందని ఎవరూ ఊహించ లేదు.ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం అరాచకం సృష్టించింది. ఆ పార్టీ నేతలు..ఎమ్మెల్యేలు...సీఎం జగన్ అండదండలు, సహకారంతో జిల్లాను లూటీ చేసేశారు.తొలుత పేదల ఇళ్ల స్థలాల పేరుతో అవినీతిని అరంభించి అక్రమ ఇసుక తవ్వకాలు, గ్రావెల్‌తో పరాకాష్టకు చేర్చారు.కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు, కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు ఇళ్ల స్థలాలు,చదునులో సంపాదించిన దానికి అంతే లేదు. ఇసుకలో వందల కోట్లతో పడగలెత్తారు. జగన్ అండతో వైసీపీ ఎమ్మెల్యేలు చెలరేగిపోయారు.జగన్ సర్కారు రకరకాల పన్నుల వాత, విద్యుత్ బిల్లుల పెంపుతో జనం నడ్డివిరిచేసింది. మందు బాబులకు షాక్ ఇచ్చారు. కల్తీ మద్యం అమ్మకాలు పెంచేశారు. జిల్లాలో ఐదేళ్ల పాటు రహదారులను గాలికొదిలేయడంతో ఎందరో ప్రమాదాలకు గురై మరణించారు.అటు రీసర్వే పేరుతో ప్రజలను జగన్ ప్రభుత్వం

- వైసీపీ అరాచకపాలన అంతమై నేటికి ఏడాది
- ఐదేళ్లలో ప్రజలను పీడించేసిన జగన్ సర్కారు
- విసుగెత్తి, విరక్తితో ఫ్యాన్‌ను ముక్కలు చేసిన ఓటర్లు
- ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటు దక్కని వైసీపీ
- నాడు కూటమికి జైకొట్టిన ప్రజానీకం

భయపెట్టింది.ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ పేరుతో జనం భూములను కొట్టేసేందుకు సైతం వెనుకాడలేదు. ప్రతి వస్తువుపై బొమ్మలు ముద్రించి జగన్ నయా కిమ్‌ను తలపించారు. అటు జిల్లాల విభజన పేరుతో కోన సీమలో అల్లర్లు రాజేశారు. సీతానగరం నుంచి కాకినాడ వరకు ఎందరో ఎస్సీ యువతపై వైసీపీ పాలకులు దాడులు,హత్యలకు దిగారు. చివరకు ప్రభుత్వ వైఫ ల్యాలను ప్రశ్నించిన ప్రతిపక్ష టీడీపీపై అక్రమ కేసులు నమోదు చేయించింది. ఇలా అక్రమాలు, అరాచకాలు, బెదిరింపు లు ,నియంత విధానాలతో వైసీపీ తన చీకటి పాలన కొనసాగించి ప్రజాస్వామ్యానికి పాతరేసింది.

ఓటేం చేయగలదంటే..

సరిగ్గా 2024 మే 13.. జిల్లా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు.. ఐదేళ్ల వైసీపీ పాలనతో విసుగెత్తిపోయిన జిల్లా ఓటర్లు అరాచకపాలన అంతమొందించడానికి ఏకమ య్యారు. ఓ ఉద్యమం తరహాలో.. కదం తొక్కారు. అన్ని వర్గాలు ఓటుతో కదిలారు. బూత్‌ల వద్ద దండెత్తారు. అర్ధరాత్రి పన్నెండు దాటినా..ఓవక్క వర్షం పడుతున్నా బూత్‌ల నుంచి అడుగుకూడా వెనక్కు వేయలేదు. కసి తీరా ఓటు హక్కు వినియోగించి వైసీపీ అరాచక పాలనకు అంతం పలికారు.ఆ ఏడాది జూన్ 4న ఎన్నికల ఫలితాల రోజు పండగ వాతావరణం నెలకొంది. ఓ నియంత పాలనకు చరమగీతం పడింది.నరకాసుర వధ జరిగిందంటూ ప్రజలు ఆనందంతో రోడ్డెక్కారు. బాణ సంచా కాల్చి పండుగ చేసుకున్నారు.

కూటమికే కట్టబెట్టారు

ఉమ్మడి జిల్లాలో వైసీపీకి ఒక్క సీటు కూడా రాకుండా ఓటర్లు ఫ్యాన్ రెక్కలు విరిచేశారు.చరిత్రను సైతం తిరగరాసిన ఈ ఫలితాల్లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో 21 సీట్లకు 21 సీట్లు టీడీపీ కూటమి గెల్చుకుని సత్తా చాటింది. నోటుకు ఓటు పడుతుందన్న వైసీపీ భ్రమలను ఓటర్లు చిత్తుచేశారు. గతేడాది వచ్చిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం పార్లమెంట్ స్థానాల పరిధిలో 21 సీట్లకు టీడీపీ 16, జనసేన 6, బీజేపీ ఒక స్థానంలో విజయ దుందుభి మోగించాయి. అటు జనసేన ఉమ్మడి తూర్పులో తొలిసారి అద్భుత ఫలితాలు సాధించింది.గతంలో ఎన్నడూ రానంత మెజార్టీలు కూటమి ఎమ్మెల్యేలకు ఓటర్లు కట్టబెట్టారు. మూడు పార్లమెంట్ స్థానాలు కూటమి కైవసం చేసు కుంది. ఒకరకంగా చెప్పాలంటే గతేడాది వెలువడిన ఫలితాల్లో గోదావరి ఓటర్ల ఆగ్రహావేశాల ప్రవాహంలో వైసీపీ కొట్టుకుపోయి గల్లంతైపోయింది. ప్రజావేశంతో ఫ్యాన్ తునాతునకలైంది.ఓటు దెబ్బకు కుదేలైపోయింది.

ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్

కాకినాడ సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్‌డీఏ నేతృత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో అగ్రభాగాన నిలిచిందని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. కాకినాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ఈ ఏడాదికాలంలో వైసీపీ సరైన ప్రతిపక్ష పాత్ర పోషించలేక రాష్ట్ర ప్రజలనుంచి ఛీత్కారానికి గురైందన్నారు. ఈ ఏడాది కాలంలో పింఛన్ రూ.4వేలకు పెంచామని, పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు తెరిచామని, రోడ్ల గుంతలు పూడ్చించి రవాణా మెరుగుపరిచామని తెలిపారు. భారీస్థాయిలో పోస్టులకు డీఎస్సీ ప్రకటించామని, మత్స్యకారులకు రూ.20 వేల వేట విరామ పరిహారం చెల్లించామని, ఉద్యోగులకు సకాలంలో వేతనాల చెల్లింపు, రైతు పండించిన ధాన్యానికి తక్షణమే నగదు చెల్లింపు.. చేపట్టామని, ఇవేమీ ప్రతిపక్ష వైసీపీకి కనపడడం లేదని అన్నారు. అధికారంలో ఉండగా జగన్ హామీలన్నీ తుంగలోకి తొక్కి నాసిరకం మద్యం ద్వారా రూ.3500 కోట్లు అక్రమ సంపాదన చేశారన్నారు. ఎన్నో నకిలీ డొల్ల కంపెనీలు పెట్టి రాష్ట్రాన్ని దివాలా తీయించారన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులు బంగారు బాట వేస్తున్నారని నవీన్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు కోర్పు సాయితేజ, పెంకే శ్రీనివాసబాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్' ఏర్పాటు చేయాలి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),జూన్3(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకం కింద గృహాలపై సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్ ఏ ర్పాటుకు అధికారులు, బ్యాంకర్లు చొరవ చూపాలని కలెక్టర్ షాన్‌మోహన్ బ్యాంకర్లను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం పీఎం సూర్యఘర్ పథకం కింద లబ్ధి గృహాలపై సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ ఏర్పాటు, రిజిస్ట్రేషన్ పురోగతి, డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి రుణాలు మంజూరు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు వంటి అంశాలపై ఏపీఈపీడీసీఎల్, డీఆర్డీఏ, లీడ్ బ్యాంకుశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం పురోగతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నందున జిల్లాలో సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ ఏర్పాటుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పథకం ప్రయోజనాలపై లబ్ధిదారులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, ఎల్డీఎం ప్రసాద్, వివిధశాఖల బ్యాంకర్లు పాల్గొన్నారు.

చివరి దశకు ధాన్యం సేకరణ

- రబీలో ఇప్పటివరకు 1.35లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 3(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ చివరి దశకు చేరుకుంది. మొత్తంగా ఇప్పటివరకు జిల్లాలో 1.35లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించారు. గతేడాది రబీ సీజన్‌లో సేకరించిన ధాన్యం కంటే ఈసారి ఎక్కువ సేకరించారు. అప్పుడు రబీలో 25,995 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. ఈసారి బొండాలు రకం ఎక్కువగా రైతులు సాగుచేశారు. తొలుత సేకరణ నెమ్మదిగా ప్రారంభమైనప్పటికీ తర్వాత పురోగతి కనిపించింది. తొలుత కేవలం 80వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరిస్తామని అధికారులు ప్రకటించారు. రైతులనుంచి ఒత్తిడి రావడంతో అది కాస్తా 1.35 లక్షల మెట్రిక్ టన్నుల వరకు వెళ్లింది.

ఇప్పటివరకు రూ.255 కోట్ల జమ

1.35లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని 15,200మంది రైతులనుంచి సేకరించారు. రూ.310 కోట్లకుగాను ఇప్పటివరకు రూ.255 కోట్లు రైతుల బ్యాంకుఖాతాలో జమైంది. మిగిలిన రూ.55కోట్లు నాలుగైదురోజుల్లో జమ కానున్నాయి. 1.35లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యంలో 86వేల మెట్రిక్ టన్నుల ధాన్యం బొండాలు రకం ఉంది. మిగిలిన 49వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సాధారణ, గ్రేడ్-ఏరకం ధాన్యం ఉంది.

బొండాలు రకం ఎఫ్‌సీఐకు..

బొండాలు రకం(బాయిల్డ్ వైరటీ) నుంచి వచ్చే ఉప్పుడు బియ్యాన్ని భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కు సీఎంఆర్ కింద ఇస్తున్నారు.

సాధారణ,గ్రేడ్-ఏలు పౌరసరఫరాలశాఖకు..

రబీలో సాధారణ, గ్రేడ్-ఏ రకాల ధాన్యం నుంచి వచ్చే పచ్చి బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ సీఎంఆర్ కింద సేకరించి ప్రజా పంపిణీ, ఇతర అవసరాలకు వినియోగిస్తుంది.

రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలి

ఇంకా ఎవరైనా ధాన్యం విక్రయించాల్సి వస్తే రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలి. జిల్లాలో 225 రైతుసేవాకేంద్రాల్లో ధాన్యం కొనుగోలు జరుగుతోంది. ప్రతి రైతువద్దఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తున్నాం.

-దేవులనాయక్, జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్

పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు కలెక్టర్ అభినందన

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్షలో కాకినాడ పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతతో విజయకేతనం ఎగరవేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శేఖర్ విద్యార్థులు సాధించిన ప్రగతిని జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతతో మంచి మార్కులు సాధించిన దేవ్‌హాసన్, స్నేహ శరణ్య, భానుసూర్యశ్రీ, హాసిని తదితర విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందలు తెలిపారు. కేంద్రీయ విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

చిట్టి చేతులతో పతకాల వేట



విల్లు ఎక్కుపెట్టిన నిత్యశ్రీ, అశ్విన్

"చిట్టి చేతులతో విల్లు పట్టుకుని బాణం ఎక్కుపెడితే గురి తప్పదు. ఐదేళ్ల ఆ చిన్నారి ప్రతిభ చూసి జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో అందరూ ఆశ్చర్యపోయి ప్రశంసల వర్షం కురిపించారు. ఆ ఏడేళ్ల బాలుడు విల్లుతో లక్ష్యాన్ని చేధించి పతకాల పంట పండిస్తున్నాడు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు చిన్నారులు ఇప్పుడు శిక్షణ పొందుతున్నారు. ఆర్చరీ పోటీల్లో చిన్నారులు చూపుతున్న ప్రతిభ అందరినీ అబ్బుర పరుస్తోంది. చిన్న వయసులోనే ప్రతిభ కనబరుస్తున్న వీరికి శిక్షణ ఇచ్చేందుకు సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉన్నత స్థాయిలో మరింతగా శిక్షణ ఇస్తే అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం ఖాయంగా కనిపిస్తోంది."

- వారు విల్లు ఎక్కుపెడితే గురి తప్పదు
- ఆర్చరీ పోటీల్లో అబ్బురపరుస్తున్న చిన్నారులు
- జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న ఐదేళ్ల నిత్యశ్రీ
- జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పతకాలు సాధించిన ఏడేళ్ల అశ్విన్

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

యువతీ, యువకులు తొలిసారి విల్లు ఎక్కుపెడితేనే చేయి వణుకుంది. అయితే ఈ చిన్నారుల్లో మాత్రం ఎక్కడా బెరుకు కనిపించదు. లక్ష్యాన్ని గురిచూసి కొట్టి పతకాలు సాధిస్తూ ఉంటారు. వారి ప్రతిభను చూసి ఆర్చరీలో నిష్ణాతులైన వారే ఔరా అంటున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం గ్రామానికి చెందిన ముమ్మిడి సూర్యసాయి నిత్యశ్రీ ఐదేళ్లకే జాతీయ స్థాయిలో అండర్-10 ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంది. తృటిలో పతకం చేజార్చుకున్నా ఆర్చరీ అసోసియేషన్ పెద్దలు చిన్నారి ప్రతిభను గుర్తించి ప్రశంసించారు.

పిఠాపురం పట్టణంలోని రథాలపేటకు చెందిన ఏడేళ్ల బాలుడు శెట్టిబత్తిన అశ్విన్ గత రెండేళ్లుగా జిల్లా స్థాయిలో పలు పతకాలు సాధించడమే గాక రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ పాల్గొని సత్తా చాటుతున్నాడు. వీరిని చూసి మరికొంతమంది చిన్నారులే కాక బాలబాలికలు, యువతీ, యువకులు ఆర్చరీలో శిక్షణ పొందేందుకు ముందుకు వస్తున్నారు. ఈ చిన్నారుల ప్రతిభ వెనుక కోచ్ పి.లక్ష్మణరావు శ్రమ ఎంతో ఉంది. కనీస సౌకర్యాలు లేకున్నా ఆర్చరీలో వారికి శిక్షణ ఇవ్వడమే గాక ఇతర రాష్ట్రాల క్రీడాకారులతో పోటీపడేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ చిన్నారుల కోసం ప్రత్యేకంగా విల్లు, బాణం తయారు చేయించి శిక్షణ ఇచ్చి తర్వాత పోటీల్లో విల్లు ఎక్కుపెట్టే లక్ష్యాన్ని గురితప్పకుండా కొట్టేలా సన్నద్ధం చేశారు. అందుకు తగ్గట్టుగానే వీరు చూపుతున్న ప్రతిభ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ ఇద్దరు చిన్నారులతో పోటీపడేందుకు పెద్ద వయసు వారు సైతం వెనకడుగు వేస్తుండడం గమనార్హం.

సౌకర్యాలు కల్పిస్తే...

ఆర్చరీ అంటేనే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. విల్లు, బాణం ఖరీదు వేలల్లో ఉంటాయి. శిక్షణ, పోటీలు జరిగే పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎటువంటి సౌకర్యాలు లేవు. అయినప్పటికీ కోచ్ లక్ష్మణరావు ఉన్న వాటితోనే శిక్షణ ఇస్తూ చిన్నారులు పలు పతకాలు సాధించేలా కృషి చేస్తున్నారు. ఇక్కడ మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే ఎక్కువ మంది ఆర్చరీలో శిక్షణ పొందే అవకాశాలు కలగడంతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో మన క్రీడాకారులు ప్రతిభ చూపుతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో ఆర్చరీలో ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్న కోచ్ లక్ష్మణరావు

చిన్నారుల ప్రతిభ, ఆసక్తి గుర్తించి శిక్షణ



పి.లక్ష్మణరావు, ఆర్చరీ కోచ్,
ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి

చిన్నారులు నిత్యశ్రీ, అశ్విన్ విల్లు పట్టుకోవడంలో చూపిన ప్రతిభ, ఆసక్తి చూసి ప్రత్యేక శిక్షణ ప్రారంభించాను. విల్లు ఎక్కు పెట్టి గురితప్పకుండా లక్ష్యాన్ని బాణంతో కొడతారు. వీరిని చూసి పెద్ద వయసు వారూ నేర్చుకుంటున్నారు. ఈ చిన్నారుల స్ఫూర్తితో 4 నుంచి 9 సంవత్సరాల వయసు ఉన్న వారు శిక్షణ పొందేందుకు ముందుకు వచ్చారు. ఈ ఏడాది వీరికి శిక్షణ ఇచ్చాం. ఆర్చరీకి అవసరమైన కనీస సౌకర్యాలు, విల్లులు, బాణాలు, ఇతర పరికరాలు సమకూరిస్తే జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో మన వారు పతకాలు సాధించేలా తీర్చిదిద్దుతాను.

నాలుగేళ్లకే విల్లు పట్టిన నిత్యశ్రీ



నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న నిత్యశ్రీ

ఐదేళ్లకే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న ముమ్మిడి సూర్యసాయి నిత్యశ్రీ నాలుగు సంవత్సరాల వయస్సులోనే విల్లు పట్టింది. గత ఏడాది పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో కోచ్ పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఆర్చరీ వేసవి శిక్షణ తరగతులను చూసేందుకు వచ్చింది. నిత్యశ్రీ విల్లు పట్టుకునేందుకు ఆసక్తి చూపడంతో చిన్న విల్లు ఇచ్చి ఎక్కుపెట్టమన్నారు. బెరుకు లేకుండా లక్ష్యాన్ని గురిచూసి కొట్టడం గమనించిన కోచ్ లక్ష్మణరావు ఆ చిన్నారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న శిక్షణ కేంద్రానికి ఆమె తండ్రి గణేష్ ప్రతిరోజూ ఇంటి నుంచి క్రమం తప్పకుండా శిక్షణకు తీసుకెళ్లేవారు. శిక్షణ ద్వారా నైపుణ్యాన్ని సాధించడమే కాకుండా పెద్దలకు సాధ్యం కాని రీతిలో బాణం లక్ష్యాన్ని కొడుతుండడం చూసి తొలుత పిఠాపురంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో అండర్-10 ఇండియన్ రౌండ్ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. తన కంటే పెద్దవారితో తలపడి విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో ఆమె ప్రతిభను చూసిన ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. అక్కడ ప్రతిభ చూపి స్కోర్ విభాగంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. గుంటూరు నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున అండర్-10 ఇండియన్ రౌండ్ విభాగం పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. తృటిలో పతకాన్ని చేజార్చుకున్నా పలు రాష్ట్రాల, జాతీయ ఆర్చరీ కోచ్‌లు, అసోసియేషన్ ప్రతినిధుల ప్రశంసలు అందుకుంది. ఈసారి జాతీయ స్థాయిలో పతకాల సాధనే లక్ష్యంగా మరలా శిక్షణ పొందుతోంది. ఈమెకు కోచ్ లక్ష్మణరావు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు.



జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన నిత్యశ్రీని అభినందిస్తున్న స్థానికులు

అశ్విన్ ఇంట పతకాల పంట

ఏడేళ్ల శెట్టిబత్తిన అశ్విన్ రెండేళ్లుగా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించాడు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటాడు. తండ్రి సురేష్ కుమారుడిని దగ్గరుండి ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని శిబిరానికి మూడేళ్లుగా తీసుకెళ్తూ లక్ష్మణరావుతో శిక్షణ ఇప్పిస్తున్నారు. అశ్విన్ చిన్ననాటి నుంచే విల్లు ఎక్కు పెట్టడంలో చూపుతున్న సత్తా ఆకట్టుకుంటోంది. ఐదేళ్ల వయసు నుంచే జిల్లా స్థాయి పోటీల్లో విజేతగా నిలిచాడు. కాకినాడలో 2023లో జరిగిన మినీ ఒలింపియాడ్‌లో బంగారు పతకం, 2024 ఏప్రిల్‌లో ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. 2024 జూన్‌లో జరిగిన పోటీల్లో పది మీటర్ల విభాగంలో మొదటి స్థానం, నవంబరులో జరిగిన పోటీల్లో 15 మీటర్ల విభాగంలో రజత పతకం గెల్చుకున్నాడు. 2025 జనవరిలో పిఠాపురంలో జరిగిన పోటీల్లో రజత పతకం సాధించాడు. విజయవాడతో పాటు వివిధ ప్రాంతాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాల సాధనే ధ్యేయంగా శిక్షణ పొందుతున్నాడు.



సాధించిన పతకాలతో అశ్విన్

తగ్గేదేలే..

ఆగని ఇసుక దందా

- అధికారుల ఆదేశాలు బేఖాతరు
- ఈనెల 1నుంచి అక్టోబరు 15వరకూ 28 ఇసుక ర్యాంపులను నిలిపివేస్తూ ఆదేశాలు
- వేల టన్నుల అక్రమ తవ్వకాలు



కాతేరు ర్యాంపులో మంగళవారం ఇసుక తవ్వకాలు జరుగుతున్న దృశ్యం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుక రుచి మరిగిన కొందరు వ్యాపారులు అధికార్లను కూడా లెక్కచేయడం లేదు. వర్షాకాలం ప్రారంభం కావడంతోపాటు, అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో 15 ఓపెన్ రీచ్‌లు, 10 సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు, 3 పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు జూన్ 1నుంచి ఆపేసినట్టు అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. 18 డీసిల్టేషన్ పాయింట్లలో మాత్రం ఇసుక తవ్వకాలు జరపడంతోపాటు ఆ జిల్లాలో 29 స్టాక్ పాయింట్లలో అధికారులు నిర్ణయించిన ధర ప్రకారం ఇసుక విక్రయించాలని కూడా ఆదేశాలిచ్చారు. కానీ ఎవరూ ఇసుక తీత ఆపలేదు. కాతేరు, సీతానగరం, కొవ్వూరు, తాళ్లపూడి, ఇతర ప్రాంతాలలో కూడా యథావిధిగా ఇసుక తవ్వకాలు జరిగాయి.



ఇసుక లోడింగ్‌కు వెళుతున్న భారీ లారీ

తాళ్లపూడిలో ఇన్‌చార్జి తహశీల్దార్ మాత్రం ఒక వాహనాన్ని సీజ్ చేశారు.

జిల్లాలో ఆగిపోయిన ర్యాంపుల వివరాలను అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. కొవ్వూరు మండలంలోని అరికిరేవుల, చిడిపి, సెమీ మెకనైజ్డ్‌రీచ్‌లు, తాళ్లపూడి మండలంలోని ప్రక్కిలంక సెమీ మైకనైజ్డ్ రీచ్‌లు, నిడదవోలు మండలంలోని పురుషోత్తపల్లి మెకనైజ్డ్ రీచ్‌లను, సీతానగరం మండలం పరిధిలోని ములకల్లంక, మునికూడలి-1,2 పట్టాభూములు నిలిపివేసిన సంగతి తెలిసిందే. అక్కడా తవ్వకాలు ఆగలేదు. ఇక మాన్యువల్ రీచ్‌లకు సంబంధించి కొవ్వూరులోని చిడిపి, కుమారదేవంలోని మూడు ర్యాంపులు, నిడదవోలులోని జీడిగుంట, పెరవలి మండలంలోని కాకరపర్రు, పందలపర్రు, పెండ్యాల, సీతానగరం మండలంలోని ములకల్లంక- కాటవరం, వంగలపూడి-1, వంగలపూడి-2, పెరవలి మండలంలోని తీపర్రు-2, తీపర్రు 3 తాళ్లపూడిలోని వేగేశ్వరపురం, కడియంలోని వేమగిరి- కడియపులంక రీచ్‌లను అధికారులు నిలిపివేసినట్టు అధికారులు ప్రకటించినా, క్షేత్రస్థాయిలో మాత్రం ఇవి ఆగకపోవడం గమనార్హం.

ప్రభుత్వం నిలిపివేసినా..

సీతానగరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలంలోని ములకల్లంక, మునికూడలి-1, 2, కాటవరం, వంగలపూడి ర్యాంపులతో పాటు మునికూడలి ర్యాంపు నుంచి వెళుతున్న ప్రక్కిలంక రీచ్‌లు ఉన్నాయి. ఈ రీచ్‌లలో 1వ తేదీ నుంచి ఇసుక రవాణా గాని, ఇసుక డంపింగ్ గాని చేయడానికి లేదు. అయితే మండలంలోని ఇసుక ర్యాంపుల్లో ఇసుక రవాణా నిలిచిపోయినా ప్రక్కిలంక ర్యాంపు మాత్రం కొనసాగుతోంది. అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ ర్యాంపు యాజమాన్యం డంపింగ్ కొనసాగిస్తోంది. స్టాకు పాయింట్ల వద్ద 2, గోదావరి నదీ గర్భంలో 3 ఎక్స్‌కవేటర్లతో డంపింగ్ చేస్తున్నారు. రాత్రిపూట లారీల్లో ఇసుక రవాణా చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై తహశీల్దార్ ఎ.శ్రీనివాస్‌ను వివరణ కోరగా వెంటనే ర్యాంపు నిలిపివేస్తామని ప్రభుత్వ ఆదేశాల మేరకు డంపింగ్ గాని, రవాణా గాని చేయకూడదన్నారు.



తాళ్లపూడిలో ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేస్తున్న అధికారులు

ఇసుక లారీ సీజ్

తాళ్లపూడి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపూడి ఓపెన్ రీచ్‌లో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నట్టు సమాచారం అందడంతో రెవెన్యూ సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి దాడి చేసి లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి తెలిపారు. అనధికార కార్యకలాపాలు నిర్వహిస్తున్న దృష్ట్యా ఓపెన్ రీచ్ యాజమాన్యానికి నోటీసు జారీచేశామన్నారు. ఓపెన్ రీచ్‌లలో అక్టోబరు 15వ తారీఖు వరకూ ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించరాదని, ఈ మేరకు మైన్స్ శాఖ ఆధ్వర్యంలో ప్రకటన విడుదల చేశారని పేర్కొన్నారు.

తూర్పున వాటర్, శానిటేషన్ భేష్

కేంద్ర బృందం మెచ్చుకోలు



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యుడు

రాజమహేంద్రవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జల జీవన్ మిషన్‌లో భాగమైన వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ నిర్వహణ తీరు భేషుగ్గా ఉందని కేంద్ర బృందం మెచ్చుకుంది. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి నీరు అండ్ స్వచ్ఛత మిషన్ నోడల్ అధికారి పూర్ణచంద్ర కిషన్ అధ్యక్షతన జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీరు, స్వచ్ఛత మిషన్ రూపకల్పన, అమలు చేస్తున్న తీరు బాగుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అధిక లవణీయత, నీటి ఎద్దడి ఉన్న అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో పర్యటించి ప్రత్యక్షంగా పరిశీలించినట్టు చెప్పారు. జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని, కానీ నిర్వహణ ఖర్చులపై దృష్టి పెట్టాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో అధిక భాగం నిర్వహణ ఖర్చు కావడానికి కారణాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కమిషన్ సమావేశాలు ప్రతినెలా జరపాలని చెప్పారు. మిషన్ నిర్వహణ లోపాలను, ప్రజా సమస్యలు తెలియజేయడానికి అందుబాటులో ఉన్న వివిధ మార్గాలపై బృందం ఆరా తీసింది. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నీటి ఎద్దడి గల గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు సమస్యలు తెలపడానికి పీజీఆర్ఎస్‌తో పాటు 1100 టోల్‌ఫ్రీ నెంబర్ల వ్యవస్థ ఉన్న సంగతిని ఆమె కేంద్ర బృందానికి వివరించారు. కేంద్ర బృందంలో జాతీయ వాష్ నిపుణుడైన బిశ్వదీప్‌దాస్ సాంకేతిక అంశాల్లో కొన్ని మార్పులను సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ జీవీ గిరి తదితరులు పాల్గొన్నారు.

తుని కేసులపై అప్పీల్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవడం హర్షణీయం



రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు

కాకినాడ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో రైలు దహనం కేసులపై అప్పీల్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవడం హర్షణీయమని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో దూరదృష్టితో సామాజిక సమతుల్యతను కాపాడేలా నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. తెలుగుదేశం పార్టీ కాపుల పక్షపాతి అని ఈ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవడం నిరూపించాయన్నారు. ఈ విషయమై కాపుల్లో గొడవలు సృష్టించాలని చూసిన వారు భంగపడ్డారన్నారు. 2016 సంవత్సరంలో ముద్రగడ పద్మనాభం సారథ్యంలో తలపెట్టిన ఛలో తుని కార్యక్రమం హింసాత్మకంగా మారి అటు నుంచి వెళ్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలును కొందరు దుండగులు తగులబెట్టారన్నారు. దీనిపై అప్పట్లో రైల్వే యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశారన్నారు. గత ప్రభుత్వంలో ఈ కేసులను రద్దు చేశారన్నారు. ఈ కేసులపై పునర్విచారణ కోసం అభ్యర్థించాలని హోం శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. దీనిపై సామాజిక సమతుల్యతను కాపాడే విధంగా ఈ ఉత్తర్వులు రద్దు చేసేలా కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు సతీష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

తీర్థయాత్రలకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులు

10న అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు



రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 10వ తేదీ సాయంత్రం 4గంటలకు రాజమహేంద్రవరం డిపో నుంచి అరుణాలచం గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని తెలిపారు. అరుణాచలం, కాణిపాకం, తిరుపతి క్షేత్రాలు చూపించడం జరుగుతుందని, టిక్కెట్ ధర రూ.3,500లుగా నిర్ణయించినట్టు తెలిపారు. అలాగే 27న రాజమహేంద్రవరం డిపో నుంచి అరుణాచలం, రామేశ్వరం యాత్రకు బస్సు నడుపుతున్నామని వెల్లడించారు. ఈ యాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, కొయంబత్తూరు, ఊటీ, మైసూరు, గురువాయుర్, త్రివేండ్రం, రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, శ్రీరంగం, తంజావూరు క్షేత్రాలు దర్శించుకోవచ్చని తెలిపారు. 9 రోజుల ఈ యాత్ర టిక్కెట్ రూ.11,300లుగా పేర్కొన్నారు. టిక్కెట్లు కావలసిన వారు, మరింత సమాచారం కోసం సెల్ 95023 00189, 99666 66544 నెంబర్లలో సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.

నేటి సాయంత్రం ఐదులోపు

వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలి

కాకినాడ డీఈవో రమేష్

కాకినాడ రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు బుధవారం సాయంత్రం 5లోపు బదిలీలకు సంబంధించిన వెబ్ ఆప్షన్స్ నమోదుచేసుకోవాలని డీఈవో పి.రమేష్ తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులంతా వెబ్ ఆప్షన్స్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

ఆలిండియా చెస్ రేటింగ్స్‌లో పీయూష్‌కు ఉత్తమ ర్యాంకు



రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన ఆలిండియా చెస్ రేటింగ్స్‌లో రాజమండ్రి నగరానికి చెందిన మద్దాలి పీయూష్ శ్రీపార్థు 1407 ర్యాంక్ సాధించాడని కోచ్ వరదా సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పియూష్‌శ్రీపార్థు రెండేళ్లుగా సురేష్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడని తండ్రి శ్రీహర్ష తెలిపారు. ఉత్తమ ర్యాంకు సాధించిన శ్రీపార్థుని ఈస్ట్ గోదావరి అసోసియేషన్ సెక్రటరీ జీవీ కుమార్, వైస్ ప్రెసిడెంట్ వై.కళ్యాణ్‌కుమార్ అభినందించారు.

సాగర..యోగా

- అంతర్వేది బీచ్‌లో యోగాంధ్ర కార్యక్రమం
- 4వేల మందితో యోగాసనాలు
- పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు, ప్రజలు

అంతర్వేది, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అంతర్వేది సాగర తీరం యోగాకు వేదికగా నిలిచింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది బీచ్‌లో మంగళవారం 4వేల మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. తీరంలో ఎగసిపడుతున్న కెరటాల నడుమ సూర్యోదయ కిరణాల మధ్య 4వేల మంది సామూహిక యోగాసనాలు చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, డీఆర్వో డి.రాజకుమారి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, డీఈవో షేక్ సలీం బాషా, డ్వామా పీడీ మధుసూదన్, నోడల్ ఆఫీసర్ రాజేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ శాంత కుమారి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్కే నవాజ్‌జాన్, జిల్లా అధికారులు, మాజీ సైనికులు, యువకులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం గంటన్నరపాటు సాగింది. యోగా గురువు పి.రామచంద్ర సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం, యోగాసనాలను వివరించారు. సుమారు 200 మంది సమన్వయంగా నిలబడి చేసిన వృక్షాసనం చూపరులను ఆకట్టుకుంది. జేసీ మట్లాడుతూ రోజు 10నిమిషాలైనా యోగా చేయడం వల్ల జీవితంలో మంచి మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమానికి హాజరైన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ పూజా వేగేశ్నకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, చాగంటి స్వామి, జిల్లా ఏసీ వి.సత్యనారాయణ తదితరులున్నారు.





యోగసనాలు వేస్తున్న జేసీ నిషాంతి



అంతర్వేది బీచ్‌లో యోగాంధ్ర కార్యక్రమ డ్రోన్ చిత్రం.. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు



యోగా ముద్రలో ఏర్పడిన ప్రజలు





యోగా బ్రిడ్జి

యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాపై విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. యోగాంధ్ర పేరిట పలు కార్యక్రమాలు చేపడుతోంది. కాకినాడలోని కొండయ్యపాలెం బ్రిడ్జి గోడలపై యోగాసనాలను ఇలా చిత్రీకరించి అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

స్టాఫ్ ఫొటోగ్రాఫర్- కాకినాడ

తప్పిన ప్రమాదం

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న గ్యాస్ సిలిండర్ల లారీ

నిలిచిన విద్యుత్ సరఫరా

సామర్లకోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ పరిధిలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మంగళవారం మధ్యాహ్నం గ్యాస్ సిలిండర్ల రవాణా లారీ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. స్తంభం విరిగిపోయి విద్యుత్ లైన్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లేకుంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. విద్యుత్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు.



విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొన్న లారీ

హోటల్‌లోకి దూసుకుపోయిన లారీ

మండపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మండపేట మండలం తాపేశ్వరం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి కంకరలారీ హోటల్‌లోకి దూసుకుపోయింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు సమీపంలో ఉన్న పంగిడి నుంచి కంకరను తీసుకుని మండపేట వైపు వస్తుండగా సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తాపేశ్వరంలో వీరవల్లి బిర్యాని హోటల్‌లోకి దూసుకుపోయిది. హోటల్ ధ్వంసం కావటంతో పాటు సామన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆస్తినష్టం తప్ప ప్రాణనష్టం వాటిల్లలేదు.



మన్యంలో ఏకపక్షంగా అధికారుల తీరు

- ఆక్రమణల తొలగింపు పేరుతో చట్టవిరుద్ధంగా విధ్వంసం
- రాష్ట్ర ప్రభుత్వ పాలనకు మచ్చ వచ్చేలా చర్యలు
- టీడీపీ అధిష్ఠానం, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లిన స్థానిక నేతలు



రంపచోడవరంలో అధికారులు నేలమట్టం చేసిన నిర్మాణాలు

రంపచోడవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మన్యంలో అధికారుల తీరు ఏకపక్షంగా కనిపిస్తోంది. రంపచోడవరం నియోజకవర్గంలోని మారేడుమిల్లి, రంపచోడవరంల్లో 3 రోజులుగా ఆక్రమణల తొలగింపు పేరుతో ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు సాగిస్తున్న విధ్వంసం గిరిజన, గిరి జనేతర తేడా లేకుండా తీరని నష్టాన్ని చేకూర్చింది. ఆర్‌అండ్‌బీ రహదారి వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించే దిశగా ఆక్రమణ దారులకు చట్టప్రకారం నోటీసులు ఇచ్చిన అధికారులు తదుపరి చట్ట విరుద్ధంగా వ్యవహరించి ఎక్స్‌కవేటర్లతో.. మిషన్లతో నిర్మాణాలను నేలమట్టం చేశారు.

పనులు మంజూరు కాకుండానే..

రంపచోడవరం మండలం ఐ.పోలవరం నుంచి భద్రాచలం రహదారి విస్తరణకు ఇంతవరకూ ఎటువంటి పనులూ మంజూరుకాలేదు. ఈ రహదారుల వెంబడి దశాబ్దాల కాలంగా జీవనాన్ని సాగిస్తున్న ప్రజల నిర్మాణాలను తొలగించాలని ప్రభుత్వం ఇక్కడి అధికారులకు ఎటువంటి ఉత్తర్వులూ ఇవ్వలేదు. ఒకవేళ విస్తరణ పనులు మంజూరు చేస్తే దానికి భూసేకరణ చేపట్టి ఆక్రమణదారులకు పరిహారాన్ని చెల్లిస్తుంది. ఇటీవల 516-ఈ జాతీయ రహదారి ప్రాజెక్టును చేపట్టి రంపచోడవరం డివిజన్ నుంచి పాడేరు డివిజన్ వరకూ ఉన్న పూర్వపు రహదారిని అనుకుని ఉన్న అందరి ఆక్రమణదారులకూ పరిహారం ఇచ్చి మరీ రోడ్డు విస్తరణ చేపట్టింది. ఇది తెలిసీ కూడా ఇక్కడి ఉన్నతాధికారులు రహదారి విస్తరణ పనుల మంజూరు కాకుండానే ఆక్రమణలను బలవంతంగా తొలగించి రోజువారీ ఆదాయంతో జీవనం సాగించే వందలాది కుటుంబాలను నిరాశ్రయులను చేశారు. అధికారుల అత్యుత్సాహం ప్రభుత్వానికే మచ్చ తెచ్చేలా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాస్థాయి నుంచి మండలస్థాయి వరకూ అందరి అధికారుల తీరు మన్యంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఓ ఉన్నతాధికారి వాహనానికి రంపచోడవరంలో ఓ ప్రైవేటు వాహనం అడ్డు రావడం ఆ అధికారి అహాన్ని దెబ్బతీసింది. దీంతో ఆయన అహాన్ని సంతృప్తిపర్చడం కోసమే ఇంతటి విధ్వం సానికి అధికారులు పాల్పడ్డారన్న విమర్శలూ వస్తున్నాయి.

సానుకూల స్పందన ఏది..

అధికారుల తీరుతో ప్రజల నుంచి వ్యక్తమవుతున్న ఆవేదనలను కూటమి ప్రభుత్వంలోని నేతలు, ప్రజాప్రతినిధులూ ఆయా అధికారులకు విన్నవించినా వారు సానుకూలంగా స్పందించలేదు. దీనిపై వైసీపీ నేతలు వ్యతిరేక ప్రచారం నిర్వహించడానికి మాత్రం అవకాశాన్ని ఇచ్చారు. పలు మాధ్యమాలు, ఫిర్యాదుల ద్వారా ఇప్పటికే ఇక్కడ అధికారుల తీరు తెన్నులపై టీడీపీ ప్రధాన కార్యాలయానికి విషయం చేరింది. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్సులో మంగళవారం ఇక్కడి ప్రజల ఇబ్బందులను ఏకరువు పెట్టి సర్వం కోల్పోయిన ప్రజలకు పునరావాసాన్ని కల్పించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు అధికారుల చర్యలపై మీడియాకి ఎక్కారు. మాజీ ఎంపీ, బీజేపీ నేత కొత్తపల్లి గీత స్పందించి మంత్రి లోకేశ్‌కు ఇక్కడి పరిస్థితిని వివరించారు. బాధితులైతే నేరుగా గిరిజనులు, గిరిజనేతరులు వేర్వేరుగా హక్కుల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి అధికారులపై చర్యలు, వారి నుంచి పరిహారాన్ని కోరుతున్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

రంపచోడవరంలో నష్టాన్ని వివరించిన ఎమ్మెల్యే శిరీష



మంగళగిరి కార్యాలయంలో మంత్రి సుభాష్‌తో ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం, మారేడుమిల్లిలో ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న నిర్మాణాలను నేలమట్టం చేసిన నేపథ్యంలో నష్టపోయిన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మంగళవారం ఆమె తన భర్త మట్టం విజయభాస్కర్‌తో కలిసి మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో మంత్రి సుభాష్ నిర్వహించిన గ్రీవెన్సు విభాగంలో రంపచోడవరం, మారేడుమిల్లి రహదారి వెంబడి నిర్మాణాలను నేలమట్టం చేసిన అంశాన్ని ఏకరువు పెట్టారు. అధికారుల తీరుతో ప్రజలకు చేకూరిన నష్టాన్ని వివరించారు. సాగుతున్న ఆక్రమణల తొలగింపును నిలుపుదల చేయాలని కోరారు.

బాధితులను ఆదుకునేందుకు కృషి : మాజీ ఎంపీ గీత

రంపచోడవరం నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రహదారి వెంబడి ఉన్న నిర్మాణాల తొలగింపుతో నష్టపోయిన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని, వారిని ఆదుకోవడంలో తన వంతు కృషి చేసి న్యాయం చేస్తానని మాజీ ఎంపీ, బీజేపీ నేత కొత్తపల్లి గీత పేర్కొన్నారు. మంగళవారం ఆమె మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. రంపచోడవరం, మారేడుమిల్లిలో ఆక్రమణ తొలగింపు ప్రక్రియలో పలు నిర్మాణాలను అధికారులు నేలమట్టం చేసిన అంశంపై తాను పరిశీలన చేయించగా బాధితుల నుంచి అనేక ఆవేదనలు వ్యక్తమయ్యాయని పేర్కొన్నారు. అనంతరం తాను ప్రభుత్వ పెద్దలతో ఈ అంశాన్ని చర్చించానని, పరిస్థితిని వారికి వివరించానని ఆమె పేర్కొన్నారు.

సిరిగలపల్లిలంకలో చైన్ స్నాచింగ్

స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ

కరప, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడ శివారు సిరిగలపల్లిలంక గ్రామంలో చైన్ స్నాచింగ్ జరిగింది. బాధితులు, పోలీసుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాజులూరు మండలం గొల్లపాలెంలో నివాసముంటున్న కొండేపూడి శాంతికుమారి కరప మండలం వేళంగి స్టేట్‌బ్యాంక్‌లో టెంపరరీ మెసెంజర్‌గా పనిచేస్తుంది. సోమవా రం రాత్రి డ్యూటీ ముగించుకుని స్కూటీపై ఇంటికి బయలుదేరింది. సిరిగలపల్లిలంక దాటిన వెంటనే వెనుక నుంచి ఇద్దరు దొంగలు మోటర్‌సైకిల్‌పై ఆమెను వెంబడించి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును అపహరించుకుపోయారు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకుని గొల్లపాలెం వైపుగా పారిపోయిన దొంగలను వెంబడించినా వారి ఆచూకీ లభించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కరప ఎస్‌ఐ తోట సునీత ఘటనాస్థలికి వెళ్లి విచారించారు. ఎరుపు రంగు గ్లామర్ బండిపై వచ్చిన ఇద్దరు అపరిచిత వ్యక్తులు కొద్దిసేపు అక్కడ చక్కర్లు కొట్టారని, దీంతో అనుమానం వచ్చి వారి బండి నెంబర్‌ను (ఏపీ05 2694) గుర్తుపెట్టుకున్నట్టుగా ప్రత్యక్ష సాక్షి ఒకరు పోలీసులకు తెలిపాడు. కాగా చైన్ స్నాచింగ్ జరిగిన ప్రదేశాన్ని మంగళవారం కాకినాడరూరల్ సీఐ చైతన్యకృష్ణ పరిశీలించి బాధితురాలు, స్థానికులను విచారించారు. స్థానిక రామాలయంలో సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సునీత తెలిపారు.



బాధితురాలు, స్థానికులను విచారిస్తున్న పోలీసులు

ట్రాక్టర్ ఢీకొని తండ్రి మృతి

కుమారులకు గాయాలు



ట్రాక్టర్ కింద రాజులు నాయుడు మృతదేహం

కోటనందూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని తండ్రి మృతిచెందగా కుమారులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవకు చెందిన గేదేల రాజులునాయుడు(35) తన కుమారులతో కలిసి మంగళవారం నాతవరం మండలం బుచ్చంపేటలో నూకాలమ్మగుడి వెళ్తున్నారు. కోటనందూరు మండలం కాకరపల్లి శివారు తమ్మిచెరువు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో రాజులునాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారులకు గాయాలుకాగా కోటనందూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

'పుట్టుకతో వచ్చే వంకర పాదాల పట్ల నిర్లక్ష్యం వద్దు'



సదస్సులో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విఠల్

జీజీహెచ్(కాకినాడ) జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో వచ్చే వంకర పాదాలు (క్లబ్‌ఫుట్) పట్ల నిర్లక్ష్యం తగదని కాకినాడ జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థో విభాగాధిపతి డాక్టర్ ఎంపీఆర్ విఠల్ సూచించారు. వరల్డ్ క్లబ్‌ఫుట్ డే కార్యక్రమంలో భాగంగా డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డీఈఐసీ) క్యూర్ ఇండియా, జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థో లెక్చర్ గ్యాలరీలో మంగళవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. విఠల్ మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే వంకర పాదాలు కలిగిన చిన్నారులను తల్లిదండ్రులు గుర్తించిన వెంటనే 21 రోజుల్లోపు జిల్లాలోని నేషనల్ హెల్త్ మిషన్ నందుగల రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమంలో భాగంగా పని చేస్తున్న డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డీఈఐసీ)కి రిఫర్ చేయాల్సిందిగా సూచించారు. అలా రిఫర్ చేస్తే ఆ విభాగానికి చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణులు, ఫిజియోథెరపి నిపుణులు తల్లిదండ్రులకు పాటించాల్సిన సలహాలు ఇచ్చి జీజీహెచ్‌లోని ఆర్థో వైద్య నిపుణులతో కాస్టింగ్ పద్ధతి ద్వారా చికిత్స అందించవచ్చన్నారు. అవసరమైతే టినోటమి అనే మైనర్ శస్త్రచికిత్స నిర్వహిస్తారని అనంతరం పరికరాలను క్యూర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అందిస్తుందని, చిన్నారి పూర్తిస్థాయిలో కోలుకునే వరకు ఫిజియోథెరపీని పూర్తిస్థాయిలో ఉచితంగా అందజేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.అరుణ, ఆర్థో ప్రొఫెసర్లు డాక్టర్ ముఖర్జీ, డాక్టర్ మధు ఉన్నారు.

ఎగైన్.. ఎండలే!

నిన్నమొన్నటి వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వర్షాలు కురిశాయి. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. అయితే ఎండల ప్రభావం మళ్లీ ప్రారంభంకావడంతో ప్రజలు అల్లాడుతున్నారు మంగళవారం ఎండధాటికి బెంబేలెత్తిపోయారు.



అమలాపురంలో నిర్మానుష్యంగా గడియారం స్తంభం సెంటర్





కాకినాడలో ఎండ నుంచి రక్షణ కోసం ప్రజల పాట్లు

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 27 మందికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ 3వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి మంగళవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 సీఐలు ఎస్. రమేష్, డి.రామారావు సిబ్బందితో సోమవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 27 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. ఒకరికి 5 రోజులు, 9 మందికి 2 రోజులు చొప్పున జైలు శిక్ష, 17 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ రమేష్ పేర్కొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే సమీక్ష

పెద్దాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో సమీక్షించారు. వ్యవసాయ, ఉద్యాన, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్, మెడికల్, ఎడ్యుకేషన్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఆర్డీవో కర్రెడ్డి శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు, గొడ్డలివేటు పేటెంట్లు జగన్‌వే

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



కాకినాడ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలోని కుంభకోణాలు బయటపడుతుండడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆ పార్టీ అధినేత జగన్‌రెడ్డి ప్రజల దృష్టిని మళ్లించడానికే ధర్నాలు చేస్తున్నారని... వెన్ను పోటు, గొడ్డలి వేటు పేటెంట్లు ఆయనవేనని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తల్లికి, చెల్లికి వెన్నుపోటు పొడిచిన జగన్ తన పరిపాలనలో ఏడాదిలో 10 శాతం హామీలు అమలు చేయలేదన్నారు. బాబాయ్‌ని గొడ్డలిపోటుతో చంపిన వారిని కాపాడుతూ ఆ కుటుంబానికి వెన్నుపోటు పొడిచారన్నారు. మద్యపాన నిషేధంపై మాట తప్పి నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాలను హరించారన్నారు. మెగా డీఎస్సీపై మాటతప్పి నిరుద్యోగ యువతకు వెన్నుపోటు పొడిచారన్నారు. అన్న క్యాంటీన్లను రద్దు చేసి పేదలు ఆకలితో అలమటించేలా చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు.

వెన్నుపోట్లు జగన్ తాతల కాలం నుంచీ అలవాటే

పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



పెద్దాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వెన్నుపోటు పొడిచిన నేత జగన్ అని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు వెన్నుపోటు పొడవడం తాతల కాలం నుంచీ జగన్‌రెడ్డి కుటుంబానికి అలవాటే అన్నారు. లిక్కర్ తదితర కేసుల్లో వైసీపీ నేతలు వరుసగా జైలుకు వెళ్లడంతో జగన్‌కు వెన్నులో వణుకుపుడుతోందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు పెద్ద దినం చేసిన రోజని తెలుసుకోవాలి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్



కాకినాడ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన రోజును వెన్నుపోటు దినంగా పరిగణించాలని జగన్‌రెడ్డి ఇచ్చిన పిలుపును టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ మోకా ఆనందసాగర్ ఖండించారు. 2024 జూన్ 4న ప్రజలు 164 సీట్లు కూటమికి కట్టబెట్టి జగన్‌రెడ్డికి పెద్ద దినం చేసిన రోజు అని తెలుసుకోవాలన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి కంటే పెద్ద వెన్నుపోటుదారుడు, కన్నుపోటుదారుడు, గన్ను పోటుదారుడు ఈ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎవరూ లేరన్నారు. ఆయన్ని నమ్ముకున్న ప్రజలతో పాటు ఎస్సీ, ఎస్టీలు, బీసీలకు వెన్నుపోటు పొడిచారన్నారు. రాష్ట్రాన్ని ఐదేళ్లు తూట్లుతూట్లుగా పొడిచి వదిలిపెట్టారరన్నారు ప్రజలకిచ్చిన హామీలను 85 శాతం నెరవేర్చకుండానే పదవి కోల్పోయారనే విషయం తెలుసుకోవాలన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించడానికే జగన్ ధర్నాల డ్రామా

కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి, కో-ఆర్డినేటర్ సత్తిబాబు



కాకినాడ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ మాజీ సీఎం జగన్‌రెడ్డి అని, కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఆయన ధర్నాల డ్రామా ఆడుతున్నారని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు అన్నారు. వలసపాకలలోని తమ నివాసంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలంతా సైకో పాలనకు చరమగీతం పాడి సైకో జగన్ అనే వైరస్‌ను ఓటు అనే శానిటైజర్‌తో ప్రక్షాళన చేసిన రోజు జూన్ 4 అన్నారు. వెన్నుపోటు అంటూ ధర్నాలు చేయడం దొంగే దొంగ అన్నట్టుగా ఉందన్నారు.

వెన్నుపోటు దినం అనడం హాస్యాస్పదం

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



పిఠాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అయిన మాజీ సీఎం జగన్ నేడు వెన్నుపోటు దినం అనడం హాస్యాస్పదంగా ఉందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఎద్దేవా చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన అక్రమాలను కప్పి పుచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే జగన్ కొత్త డ్రామాలకు తెరలేపారని విమర్శించారు.

అన్ని పోట్లకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



పెదపూడి (కరప), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అన్ని పోట్లకు బ్రాండ్ అంబాసిడర్ జగన్ అని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. పెదపూడి మండలం గొల్లల మామిడాడలో మంగళవారం ఆయన పర్యటించి రేషన్ షాపుల పునరుద్ధరణ సందర్భంగా పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పలువురు లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందించారు. అవాకులు, చవాకులు పేలుతున్న మాజీ ఎమ్మెల్యే దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని రామకృష్ణారెడ్డి సవాల్ విసిరారు. పెదపూడి మండల కూటమి నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో యోగా శిక్షణ ఇస్తున్న దృశ్యం

'యోగాతో ఒత్తిడి నియంత్రణ'

కాకినాడ క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు దోహదపడుతుందని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులకు సామూహిక యోగా శిక్షణ ఇస్తున్నారు. ఎస్పీ మట్లాడుతూ నిత్యం ఒత్తిడికి లోనయ్యే పోలీసు సిబ్బందికి యోగా మనశ్శాంతి చేకూరుస్తుందన్నారు. ప్రజలు, యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిబాబు, ఆర్ఐ మూర్తి పాల్గొన్నారు.

'పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి'

కార్పొరేషన్/కాకినాడ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మేజర్, మైనర్ డ్రైన్లలో పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదేశించారు. సినిమా రోడ్డులోని మేజర్ డ్రైన్లలో పూడికతీత పనులను మంగళవారం ఆయన అదనపు కమిషనరు సుధాకర్‌తో కలిసి పరిశీలించారు. పలువురు వ్యాపారస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పూడికతీత నేపథ్యంలో డ్రైనేజీలపై ఏర్పాటు చేసిన సిమెంటు రాళ్లను తొలగించడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సిల్ట్‌ను పూర్తిస్థాయిలో తొలగించి ముంపు సమస్యను నివారించాలని ఎమ్మెల్యే సూచించారు. జూన్ మొదటివారంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ నెలాఖరు నాటికి పూడికతీత పనులు పూర్తి చేసి మురుగునీటిపారుదలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఈ వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు పొంగా బుజ్జి, బంగారు సత్యనారాయణ, అమలకంటి బలరామ్, రెడ్నం సత్తిబాబు, కోడూరి పెద్ద, కరాటి శ్రీను పాల్గొన్నారు.

బాలికల బంగారు భవిష్యత్తుకు 'కిశోరి వికాసం' పునాది



సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయకుమారి

సామర్లకోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయకుమారి పేర్కొన్నారు. సామర్లకోట ప్రాజెక్టు పరిధిలో కిశోరి వికాసం పేరిట అవగాహన సదస్సును సీడీపీవో జి.ఉష అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీ విజయకుమారి మాట్లాడుతూ సాధికారిత దిశగా ఆమెవేసే అడుగుకు సమష్టి కృషితో చేయూతనిద్దామన్నారు. బాలికా సంఘాల ఏర్పాటు, సమస్యల పరిష్కారానికి చొరవ, గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కార్యక్రమాలు నిర్వహించాలని సీడీపీవోలు, సూపర్‌వైజర్లకు సూచించారు. ప్రతి బాలికా తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి ద్వారా చేయూత ఇస్తామన్నారు. 11-18 సంవత్సరాల వయసు గల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగుపర్చడం ఈ కార్యక్రమ ప్రధానోద్దేశ్యమన్నారు. ఆత్మరక్షణ శిబిరాల ఏర్పాటు, డిజిటల్ భద్రత, సైబర్ క్రైం, ఆన్‌లైన్ వేదికలపై జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పిస్తామన్నారు. బాలికలకు సీడీపీవో ఉష పలు అంశాలను వివరించారు. సూపర్‌వైజర్లు మంగ, సుల్తానాబీబీ, నిర్మలాకుమారి, ఉమాదేవి, అంగన్వాడీ సిబ్బంది సత్యశార్వాణి, సుగుణ, కిశోర బాలికలు పాల్గొన్నారు.

సంక్షేమం, సేవా కార్యక్రమాలే లక్ష్యం

పి-సేవ ఆవిర్భావ దినోత్సవంలో టెన్త్ టాపర్లకు సత్కారం



580కి పైగా మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

పిఠాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, అన్ని వర్గాలను ఆదుకునేలా సేవా కార్యక్రమాలు నిర్వహించడం లక్ష్యంగా పిఠాపురం నియోజకవర్గ ఉద్యోగుల సంక్షేమ సంఘం (పి-సేవ) ఏర్పాటైందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో మంగళవారం జరిగిన సంఘ ఆవిర్భావ దినోత్సవంలో నియోజకవర్గంలో 580కి పైగా మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులను, ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులను పి-సేవ ప్రతినిధులు సత్కరించారు. ఏడాది కాలంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పి-సేవ వ్యవస్థాపక అధ్యక్షుడు చామంతి నాగేశ్వరరావు, సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందు బాబూరావు, ఏడిద రమేష్, కోశాధికారి తోట నాగప్రసాద్, ఘంటా ప్రసాద్, విశ్రాంత ఎంఈవోలు నామా ఏసుదాసు, గాజుల సుబ్రహ్మణ్యం, మురళీభాస్కర్, చిందాడ చిన్నోడు, సీతాదేవి, ప్రమీల, పుష్పమి కీర్తి, గంగోత్రి, దాడి పద్మనాభం, సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

ఘనంగా కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

గొల్లప్రోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు కరణంగారితోటలో వేంచేసియున్న కనకదుర్గమ్మ ఆలయ పునః ప్రతిష్ఠ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారికి కుంకుమ పూజలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. 24గంటల పాటు నిరంతరాయంగా భజనలు జరిగే ఏకాహం ప్రారంభమైంది. అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గరగ తాతాజీ, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

పెద్దాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామారావుపేటకు చెందిన రొంగల ఆనంద్‌కు వెన్నెముక శస్త్ర చికిత్స నిమిత్తం రూ.67,038, రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాత పెద్దాపురానికి చెందిన బొగ్గు వీరబాబుకి రూ.81,965 ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరయ్యాయి. మంగళవారం వారికి చెక్కులను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు అందజేశారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ అరీఫ్ అలీ, రంది సత్యనారాయణ పాల్గొన్నారు.



యాక్షన్ ప్లాన్‌ను అధికారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ అభివృద్ధికి విజన్ యాక్షన్ ప్లాన్-2029

కాకినాడ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా కాకినాడ నగర అభివృద్ధికి విజన్ యాక్షన్ ప్లాన్-2029 రూపొందించినట్టు ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వెల్లడించారు. మంగళవారం ఆయన జగన్నాథపురంలోని తన కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను చేరుకునేందుకు, జిల్లా వృద్ధి రేటు 15 శాతం పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం, మానవవనరుల అభివృద్ధి, నీటి భద్రత వంటి అంశాలతో విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. ప్లాన్ నివేదికను అధికారులకు అందజేశారు. సమావేశంలో అదనపు కమిషనరు కేటీ సుధాకర్, ఎస్ఈ వెంకట్రావు, హెల్తాఫీసర్ పృథ్వీచరణ్, సీపీఏపీ టీమ్ సభ్యులు సుష్మ, సూర్యకుమారి, సాయిపూజ, దేవిక, శాలిని తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

'యోగాతో ఎన్నో ప్రయోజనాలు'

గొల్లప్రోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయాల సిబ్బందికి యోగా గురువు వనం సత్యప్రియ ఆధ్వర్యంలో మంగళవారం యోగా శిక్షణ ఇచ్చారు. యోగాంధ్రలో భాగంగా పట్టణంలో ర్యాలీ జరిపి యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నగర పంచాయతీ కమిషనరు నామ కనకారావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, కిశోర బాలికలు

'నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి'

పిఠాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని తోటివారికి ఆదర్శంగా నిలవాలని ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్‌ఎస్‌కే దుర్గాదేవి సూచించారు. కిశోరి వికాసం వేసవి తరగతుల్లో భాగంగా పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో సెషన్-10లో నాయకత్వం, సాధికారిత అంశాలపై శిక్షణ ఇచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, చెడు, మంచి స్పర్శలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దాసం మణి, జీఎంఎస్‌కే సంధ్యారాణి, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



సౌమ్య (పాత చిత్రం)

కరప, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంగోడు గ్రామానికి చెందిన ఆట్ల సౌమ్యకు రెండేళ్ల క్రితం సుబ్బరాజు అనే వ్యక్తితో వివాహం కాగా ఒక పాప ఉంది. మంగళవారం మధ్యాహ్నం అత్తగారితో గొడవపడిన సౌమ్య కోపంతో ఇంట్లోంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబసభ్యులు ఆమె కోసం ఎంత గాలించినా ఆచూకీ లభించకపోవడంతో రాత్రి కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. సౌమ్య ఆచూకీ తెలిసిన వారు కరప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.



గోరింటలో ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

రైతు కూలీ సంఘం నేతల ఆందోళన

పెద్దాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అతి తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ వారిని అధోగతిపాల్జేస్తున్నారని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆరోపించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గోరింట గ్రామంలో రైతులతో ఆయన సమావేశమై వారి సమస్యలపై చర్చించారు. గిట్టుబాటు ధర లేక అన్నదాతలు నష్టపోతున్నారంటూ ధర్నా నిర్వహించారు. సంఘ నాయకులు దేశెట్టి సురేష్, కర్రి తమ్మారావు, మాదిరెడ్డి తాతయ్య, కర్రి శ్రీను, మిరియాల రామకృష్ణ, మిర్యాల రాంబాబు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సుపరిపాలన వేడుకలు


పిఠాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పట్టిన వైసీపీ పీడ విరగడై ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం వేడుకలు జరుపుకుందామని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనల మేరకు బుధవారం ఉదయం సుపరిపాలనకు ఏడాది సందర్భంగా మహిళలకు రంగవల్లుల పోటీ నిర్వహించి సంక్రాంతి పండుగ మాదిరి జరుపుకుందామని తెలిపారు. దీపావళి మాదిరిగా టపాసులు కాల్చి దీపాలు వెలిగించి పండుగ చేసుకుందామని చెప్పారు. రంగవల్లులు, దీపాల కాంతుల ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయాలని కోరారు. జనసేన నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

7వ తేదీలోగా పాఠశాలల్లో చేరాలి

పిఠాపురం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం ద్వారా ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఉచిత సీట్లు పొందిన విద్యార్థులంతా ఈ నెల 7వ తేదీలోగా వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరాలని పిఠాపురం ఎంఈవో శ్యాంబాబు సూచించారు. పిఠాపురం పట్టణం, మండలంలోని 233 మంది విద్యార్థులను ఉచిత సీట్లకు ఎంపిక చేసి సంబంధిత పాఠశాలలకు సమాచారం ఇచ్చామని తెలిపారు. ఉచిత సీటు కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఇతర వివరాల కోసం సంబంధిత విద్యా సంస్థలు లేదా ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ

కొత్తపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పీహెచ్‌సీ వద్ద మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీని డాక్టర్ శ్వేత మంగళవారం ప్రారంభించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మలేరియాను దరిచేరకుండా చేయవచ్చన్నారు. ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పలువురు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



నారా లోకేశ్ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న అధ్యక్షుడు సుబ్బు

చంద్రబాబును కలిసిన సుబ్బు

కాకినాడ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రవ్యాప్తంగా ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఫౌండేషన్‌కు టీడీపీ అండగా ఉంటుందని, మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ప్రోత్సహించారని సుబ్బు చెప్పారు.

డ్రాయింగ్ పోటీలు

కొత్తపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం విద్యార్థులకు డ్రాయింగ్‌పై తర్ఫీదు ఇచ్చారు. అనంతరం వారికి పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్ ట్రైనర్ డి.ఆనంద్‌కుమార్, కొత్తపల్లి, ఉప్పాడ శాఖల గ్రంథాలయాల అధికారులు తుమ్మలపల్లి జయకృష్ణ, తెలగంశెట్టి నళినీప్రియ పాల్గొన్నారు.

ర్యాంకర్‌కు సత్కారం

రౌతులపూడి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఐఎఫ్ఎస్‌లో 49వ ర్యాంక్ సాధించిన మూలగపూడికి చెందిన చింతకాయల లోవకుమార్‌ను జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ అభినందించారు. బేజేపీ మండలా ధ్యక్షుడు లవుడు శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దాసరి వీరబాబు, కోరుప్రోలు రాము, జేమీల్, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



రాజుపేట గ్రామస్తులతో మాట్లాడుతున్న పీవో

రాజుపేటలో సమస్యలు లేకుండా చర్యలు

గ్రామంలో పీవో అపూర్వ భరత్ పర్యటన

ఎటపాక, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-తెలంగాణ సరిహద్దు గ్రామం రాజుపేటలో సమస్యలు లేకుండా సత్వరమే చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ అన్నారు. మంగళవారం ఆయన రాజుపేటలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర సరిహద్దు గ్రామం రాజుపేటలో నెలకొన్న విద్యుత్, రహదారులు, తాగునీటి సమస్యలను పీవో దృష్టికి టీడీపీ అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముమ్వా శ్రీనివాస్ తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పీవో అపూర్వ భరత్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా ఇటీవల రాజుపేట గ్రామ సమస్యలపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లినట్టు శ్రీనివాస్ తెలిపారు. అనంతరం పీవో బుట్టాయిగూడెంలోని అటవీ శాఖ నర్సరీని పరిశీలించారు. ఈనెల 5న నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీపీ కాక కామేశ్వరి, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, పీఆర్ ఏఈ ఎర్రయ్య, ఎటపాక సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న జెన్‌కో ఉన్నతాధికారులు

డొంకరాయి ఆనకట్ట గేట్ల గైడ్ రోలర్లకు మరమ్మతులు

మోతుగూడెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లోని డొంకరాయి ప్రధాన ఆనకట్ట 12గేట్ల గైడ్ రోలర్లకు మరమ్మతులు చేపట్టినట్లు సీలేరు కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ చీఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా డొంకరాయి ప్రధాన ఆనకట్ట గేట్లు ఎత్తడంలో ఎటువంటి ఆటంకాలు రాకుండా ఉండేందుకు ఈపనులను గుత్తేదారుకు అప్పగించామన్నారు. ఒక్కో గేటుకు పది గైడ్ రోలర్లు ఉంటాయన్నారు. ఇప్పటికే 25శాతం పనులు పూర్తయ్యాయని, వారం రోజుల్లో మొత్తం పనులు పూర్తవుతాయన్నారు. కాంప్లెక్స్ డొంకరాయి డివిజన్ ఈఈ గంటీ భాస్కరరావు, డిప్యూటీ ఈఈ సీహెచ్ శ్రీనివాసరావు, ఏఈలు కాళ్ల శివశంకర్, విజయ్‌పాల్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

మోతుగూడెంలో ఆక్రమణలపై నోటీసులు

మోతుగూడెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమిత స్థలాల్లో నిర్మించిన కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని చింతూరు తహసీల్దార్ చిరంజీవి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఆక్రమణదారులకు లిఖిత పూర్వకంగా పత్రాలు అందజేశారు. 15రోజులు వ్యవధిలో ఆక్రమణలు తొలగించుకోకపోతే అధికారుల సమక్షంలో ఆక్రమణలు తొలగిస్తామని హెచ్చరించారు.



నోటీసులు అందజేస్తున్న దృశ్యం

ప్రభుత్వ పథకాలపై అవగాహన

వీఆర్‌పురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై ట్రైబల్ యూత్ వలంటీర్లకు రేఖపల్లి ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు ఆధ్వర్యంలో ఆ సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో అవగాహన సదస్సు మంగళవారం నిర్వ హించారు. ఈసందర్భంగా గాంధీబాబు మాట్లాడుతూ వాట్సాప్ యాప్ ద్వారా ప్రభుత్వ పథకాలకు ఎలా దరఖాస్తులు చేసు కోవాలో వివరించారు. వీఆర్‌పురం, చింతూరు మండలాల్లోని 40 గ్రామాల నుంచి వచ్చిన యూత్ వలంటీర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ శాఖ నుంచి నరేంద్ర, ఏఎస్‌డీఎస్ ప్రాజెక్టు మేనేజర్ సాయిచైతన్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న గాంధీబాబు

శిక్షణ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జనరల్ డ్యూటీ అసిస్టెంట్, దేశీయ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.వసుధ, జిల్లా నైపుణ్య సంస్థ అధికారిణి డాక్టర్ పి.రోహిణి తెలిపారు. శిక్షణ 90రోజులు ఉంటుందని, పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన యువత ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 6281618037, 6304634447ను సంప్రదించాలన్నారు.



క్రికెట్ అభిమానుల కోలాహలం

మోతుగూడెం: పొల్లూరులో ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకిస్తున్న క్రికెట్ అభిమానులు

ఘనంగా కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

గొల్లప్రోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు కరణంగారితోటలో వేంచేసియున్న కనకదుర్గమ్మ ఆలయ పునః ప్రతిష్ఠ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారికి కుంకుమ పూజలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. 24గంటల పాటు నిరంతరాయంగా భజనలు జరిగే ఏకాహం ప్రారంభమైంది. అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గరగ తాతాజీ, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓపీ కష్టాలు

● ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రి ఓపీ విభాగం వద్ద జనాల అవస్థలు
● మంగళవారం రోజు మరీ ఎక్కువ రద్దీ

ప్రత్తి పాడు, జూన్3 (ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఓపీ విభాగం వద్ద జనాలు కిక్కిరిసిపోతున్నారు. వైద్యం పొందేందుకు ప్రాథమికంగా అవసరమయ్యే ఓపీ చీటీ కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఈ పరిస్థితి మంగళవారమైతే మరీ ఎక్కు వగా ఉంటుంది. ఈ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మైకేల్ సారథ్యంలో 10 మంది పైబడి వైద్యులు సేవలు అందిస్తున్నారు. ఆరు మండలాలకు చెందిన రోగులు ఇక్కడకి వస్తుంటారు. దీనికి తోడు సదరం శిబిరం ఇదే ఆసుపత్రిలో నిర్వహించడం వల్ల పెద్దఎత్తున దివ్యాంగులు కూడా పరీక్షల కోసం తరలివస్తున్నారు. సాధారణంగా రోజువారీ వచ్చే రోగుల సంఖ్య 400 పైబడి ఉండగా సదరం శిబిరం, గర్భిణుల పరీక్షల కోసం కేటాయించే మంగళవారం రోజున ఈ సంఖ్య 500పైగా ఉంటుంది. దీంతో ఆసుపత్రిలో ఓపీ చీటీ పొందడానికి రోగులు అవస్థలు పడాల్సిన దుస్థితి. ఓపీ విభాగం ఇరుకుగా ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ దివ్యాంగుల కోసం నిర్వహించే సదరం శిబిరాన్ని వేరే చోటకు మార్చడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.



ఆసుపత్రిలోని ఓపీ విభాగం వద్ద కిక్కిరిసిన మహిళలు

గజ్జనపూడిలో గిరిబాబు పర్యటన

ప్రత్తిపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కోరారు. మంగళవారం గజ్జనపూడిలో గిరిబాబు పర్యటించారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీఇచ్చి ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. పాత రేషన్ పద్ధతి ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయడం లబ్ధిదారులను మరింత ఇక్కట్లకు గురి చేయడమేనన్నారు. సర్పంచ్ జి.అప్పలరాజు, రామిశెట్టి నాని, దారా రమణ, బర్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్లు నిండిన బీసీలకు పింఛను మంజూరు చేయాలి



ఎంపీడీవో కుమార్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీను

ప్రత్తిపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 50 ఏళ్లు నిండిన బీసీలకు పింఛను మంజూరు చేయాలని జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను కోరారు. మంగళవారం ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి వినతిపత్రం అం దజేశారు. దాసరి సత్తిబాబు, కోన సూరిబాబు, కోటిపల్లి సూరిబాబు, గంగుమళ్ళ సత్తిబాబు, గంగుమళ్ల వెంకన్న పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి ఇన్సూరెన్సు చెక్ అందజేత



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

శంఖవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన జనసేన కార్యకర్త బోనం సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఆ పార్టీ ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు రూ. 5 లక్షల చెక్కును మంగళవారం అందజేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ ఆధ్వర్యంలో విజయవాడలో చెక్కును అందించారు. కార్యక్రమంలో ప్రోగాం కమిటీ సభ్యులు కరణం సుబ్రహ్మణ్యం, మండలాధ్యక్షుడు గాబు సుభాష్, తలపంటి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ఇన్వర్టర్, బ్యాటరీ అందజేత

తుని రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల ప్రిపరేషన్‌కు ఆటంకం కలగకుండా తుని రోటరీ క్లబ్‌సభ్యులు రాజా గ్రౌండ్ వద్ద గల గ్రంథాలయానికి ఇన్వర్టర్ బ్యాటరీని అందించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు సీహెచ్ మంగరాజు, సెక్రటరీ ఎం. వీర్రాజు, ట్రెజరర్ కె.కిషోర్ రెడ్డి, డి. సత్యసాయి. ఎం.వివేకానంద్, కె. ఈశ్వర్ గణేష్ పి.మోహన్ కృష్ణ, ఎస్.నాగభూషణం ఉన్నారు.

వెన్నుపోటు, గొడ్డలి వేటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

● నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, జూన్3 (ఆంధ్రజ్యోతి): వెన్ను పోటు, గొడ్డలి వేటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్ రెడ్డి అని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నిప్పులు చెరిగారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఈనెల 4న వైసీపీ నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమంపై ఎద్దేవా చేశారు.జగన్ కుటుంబమే వెన్నుపోట్లు పొడుస్తూ అందల మెక్కిందన్నారు. నమ్మి ఓట్లు వేసిన అన్ని వర్గాలను మోసం చేసి ఇచ్చిన హామీలు తుంగలోకి తొక్కాడన్నారు. నిబద్ధతతో పరిపాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంపై జగన్ కుట్రలు సాగవు. నీకు సవాల్ విసురుతున్నాను. 15 ఏళ్ల నీ రాజకీయ జీవితంలో అన్నీ మచ్చలే దమ్ముంటే చర్చకు రా అని జగన్‌కు నెహ్రూ సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, పైడిపాల సూరిబాబు, ముండ్రు ఎర్రబాబు, దాపర్తి సీతారామయ్య, బద్ది సురేష్, నల్ల చిరంజీవి, అడనా తాతా.ఈచ అడబాల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జిల్లా జడ్జిని కలిసిన ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ప్రతినిధులు



పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా జడ్జి గంధం సునీతను మంగళవారం ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రత్తిపాడులో అడిషనల్ కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, గౌరవ అధ్యక్షుడు కొల్లా వీర్రాజు విన్నవించారు. దీనిపై హైకోర్టు దృష్టికి తీసుకెళ్లామని, హైకోర్టు కూడా దీనిపై సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటుందని జడ్జి సునీత వివరించారు. కార్యక్రమంలోబార్ వైస్ ప్రెసిడెంట్ కొప్పిశెట్టి శ్రీనివాసరావు, పి.నాగేంద్రరావు, సభ్యులు యార్లగడ్డ శ్రీనివాస్, మోతుకూరి శ్రీనివాస్, మాదాల మంజూష, పాల్గొన్నారు.

నేడు తునిలో భారీ బహిరంగ సభ

తుని రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువు తీరి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య తొలి వసంత వేడుకను భారీ ఎత్తున నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు తుని జాతీయ రహదారిని ఆనుకుని డిగ్రీ కళాశాల సమీపంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఏర్పాట్లకు సంబంధించి నాయకులు సభాస్థలిలో భూమి పూజచేశారు. కార్యక్రమంలో యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, సుర్ల లోవరాజు, యినిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, తదితరులు ఉన్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

'సంక్షేమ పథకాలు ఎత్తివేయడానికి ప్రయత్నాలు'



చింతలూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బంగార్రాజు

ప్రత్తిపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చింతలూరులో అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం మంగళవారం జరిగింది. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు పూడిగుంజేస్తున్నారని, అమెరికాకు సామ్రాజ్యవాదానికి గులాంగిరి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమ పథకాలను ఎత్తి వేయడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఇచ్చిన హామీలు సూర్ సిక్స్ విఫలం అయ్యాయన్నారు. సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు మానుకొండ లచ్చబాబు మాట్లాడుతూ తుని మండలంలో సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. రేచుకట్ల సింహాచలం, తాగి నాగేశ్వరరావు హాజరయ్యారు.



కత్తిపూడి జాతీయ రహదారిపై ఇబ్బందులుపడుతున్న వాహనదారులు

హైవేపై వాహనదారులకు ఇక్కట్లు

శంఖవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16వ నెంబరు జాతీయ రహదారి కూడళ్ల వద్ద ట్రాఫిక్ వాహనదారులకు ఇక్కట్లు తప్పడంలేదు. ముఖ్యంగా 16, 216 జాతీయ రహదారుల కూడళ్ల వద్ద, కత్తిపూడి, నెల్లిపూడి సెంటరు పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. ఏ వైపు నుంచి ఎవరు వస్తున్నారో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం వేళ ఇక్కట్లు మరీ ఎక్కువగా ఉంటున్నాయి. దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనాలు సెంటరును గమనించక ప్రమాదాలు జరుగుతున్నాయి. నెల్లిపూడి సెంటరులో చిరువ్యాపారులు, యూనియన్ ఆటోలు రోడ్లపై ఇష్టానుసారంగా నిలిపివేయడంతో జాతీయ రహదారి సైతం ఇరుకురోడ్డులా మారుతుంది. పోలీసు అధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.

జగ్గంపేటలో డొక్కా సీతమ్మ క్యాంటీన్



భోజనాలు వడ్డిస్తున్న తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రతి మంగళవారం జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. ఈవారం జరిగిన కార్యక్రమానికి తుమ్మలపల్లి రమేష్ హాజరై అన్నదానాన్ని ప్రా రంభించి పేదలకు వడ్డించారు. కార్యక్రమంలో మాదారపు వీరబాబు, సత్తి సోమరాజు, కురుమళ్ళ నాగేశ్వరరావు, మండపాక బాపన్నదొర, డ్రిల్ మాస్టారు, గంధం వంశీ, అడ్డూరి పద్మరాజు, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మార్పీఎస్‌తో కొండేపూడి వర్గానికి సంబంధం లేదు'

జగ్గంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒకటే ఎమ్మార్పీఎస్ ఉందని, కొండేపూడి శ్యాంబాబు వర్గానికి చెందిన ఉదయ్‌కుమార్‌కు దీంతో సంబంధం లేదని ఎమ్మార్పీఎస్ ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చినసుబ్బారావు తెలిపారు. మంగళవారం జగ్గంపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్‌కు కొండేపూడి వర్గంతో సంబంధం లేదని జాతీయ నాయకుడు మంద కృష్ణ ప్రకటించారన్నారు. కొండేపూడి వర్గం నకిలీ ఎమ్మార్పీఎస్ అని వ్యాఖ్యానించారు. సమావేశంలో నాయకులు దూలపల్లి వెంకటరమణ, ఆరుగల్లు పండు, వల్లూరి సత్తిబాబు, కోరింట అబ్బులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు బీజేపీ నేత సన్మానం



ఎమ్మెల్యే సత్యప్రభను శాలువా కప్పి పుస్తకాన్ని అందజేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాను మంగళవారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేగా ఏడాది కాలం పదవీ బాధ్యతలు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ నాయకులు పెద శంకర్లపూడి తరలివెళ్లి ఎమ్మెల్యేకు హృదయపూర్వకశుభాకాంక్షలు తెలిపారు. నామినేటెడ్ పదవుల నియామకాలు, పథకాల అమలు, పార్టీల మధ్య సమన్వయంపై చర్చించారు. ఎన్డీయే కార్యకర్తల్లో ప్రభుత్వ పథకాలపై మరింత అవగాహన కల్పించేందుకు సమావేశంలో నిర్ణయించారు. బీజేపీ నాయకులు సింగిలిదేవ్ సత్తిరాజు, కర్రి ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

తుని టీడీపీ పట్టణాధ్యక్షురాలుగా శోభారాణి

తుని రూరల్ , జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీ అధిష్ఠానం మహిళలకు అగ్ర తాంబూలం అందిస్తుంది. ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నార్ల భువన సుందరికి అవకాశం ఇవ్వగా తాజాగా ఆర్యవైశ్య ప్రముఖురాలు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణికి తుని టీడీపీ పగ్గాలు అప్పగించి పట్టణ అధ్యక్షురాలిగా ఎంపికచేశారు. మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సూచనలతో ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఈ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

యోగాంధ్రపై రంగవల్లుల పోటీలు

కోటనందూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రపై కోటనందూరు మండల పరిషత్ కార్యాలయం నందు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. దీనిలో భాగంగా ఎంపీడీవో పి. వెంకటనాయుడు, ఎంఈవో శేఖర్ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా అవుతున్నా పట్టించుకోరా?

ఏలేశ్వరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు వార్డుల్లో కుళాయి పైపుల ద్వారా తాగునీరు వృథాగా పోతుంది. వేసవిలో తాగునీరు లేక అప్ప నపాలెం, చైతన్యనగర్, నంది వీధుల్లో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పలు వార్డుల్లో తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దిబ్బలపాలెం, సాయినగర్, కళాశాల రోడ్డు, మెక్కారావుకాలనీ, సువ్వయ్యమ్మ పేటలలో కుళాయి ట్యాప్‌లు లేకపోవడంతో కొద్దిరోజులుగా తాగునీరు వృథా గా పోతుంది. దీనిపై మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కుళాయిలకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.



పట్టణంలో కుళాయి నుంచి వృథాగా పోతున్న తాగునీరు

వివాహిత అదృశ్యంపై కేసు



కరప, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంగోడు గ్రామానికి చెందిన ఆట్ల సౌమ్యకు రెండేళ్ల క్రితం సుబ్బరాజు అనే వ్యక్తితో వివాహం కాగా ఒక పాప ఉంది. మంగళవారం మధ్యాహ్నం అత్తగారితో గొడవపడిన సౌమ్య కోపంతో ఇంట్లోంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబసభ్యులు ఆమె కోసం ఎంత గాలించినా ఆచూకీ లభించకపోవడంతో రాత్రి కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. సౌమ్య ఆచూకీ తెలిసిన వారు కరప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.